క్లుప్తంగా

రిటైర్డ్ ప్రొఫెసర్ రాజయ్యకు నివాళి



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ ఎకనామిక్స్ విభాగం రిటైర్డ్ ఆచార్యులు గుజ్జుల రాజయ్య చెందగా అధ్యాపకులు నివాళు లర్పించారు. మంగళవారం ఎకనామిక్స్ విభాగం వద్ద విభాగం అధిపతి ఆచార్య బి.సురేష్‌లాల్, అధ్యాపకులు రాజయ్య చిత్రపటా నికి పూలమాల వేసి నివాళులర్పించారు. అధ్యాపకులు డాక్టర్ విద్యాసాగర్, డా క్టర్ సాధు రాజేశ్, డాక్టర్ సాంబశివరావు, డాక్టర్ ఎర్ర బొజ్జు రమేష్ తదితరులు నివాళులర్పించారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

హన్మకొండ చౌరస్తా : డయాబెటిక్, గుండె సంబంధిత వ్యాధులపై హనుమకొండ చౌరస్తా సమీపంలోని పద్మాక్షి పాలిక్లినిక్‌లో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి యాజమాన్యం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. శిబిరంలో ప్రముఖ ఎండ్రోక్రైనాలజిస్టు డాక్టర్ ఇ.లక్ష్మణ్‌కుమా డయాబెటిక్, థైరాయిడ్, ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ పీవీ అనిల్‌కుమార్ పాల్గొని ఉచిత వైద్యపరీక్షలు, తగు సూచనలు ఇస్తారని తెలిపారు. ఈ క్యాంపు ద్వారా సుమారు రూ. 5వేల విలువైన కాలేయ కొవ్వు స్థాయిని గుర్తించే ఫిబ్రోస్కాన్, కాళ్ల మంటలు, కాళ్ల నరాలకు సంబంధించిన న్యూరోపతి స్క్రీనింగ్ పరీక్షలను ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్యశిబిరం కొనసాగుతుందని పేర్కొన్నారు. ఉచిత వైద్య సేవలకోసం 99559 96166, 91338 93360 నంబర్లకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

అతిథి ఆశ్రమంలో పండ్లు పంపిణీ



హన్మకొండ చౌరస్తా : హైదరాబాద్ ఈస్ట్‌జోన్ డీసీపీ రావుల గిరిధర్ జన్మదినాన్ని పురస్కరించుకుని మంగళవారం విశ్వబ్రాహ్మణ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెడ్డికాలనీలోని అతిథి దివ్యాంగుల ఆశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు అన్నదానం కోసం అసోసియేషన్ బాధ్యుడు పెద్దోజు వెంకటచారి ఆర్థికసాయం అందజేశారు. అనంతరం ఎంజీఎం ఆస్పత్రిలో 35వ సారి రక్తదానం చేశాడు. కార్యక్రమంలో షణ్ముఖచారి, వేణు, రాము, సర్వేశ్వర్, రాజు, రవీందర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



కాజీపేట: నగరంలోని 62వ డివిజన్ సోమిడిలో విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉంది. రెండు రోజుల కింద భారీ గాలి, దుమారం రావడంతో స్తంభం ఒరిగిపోయింది. నూతనంగా నిర్మిస్తున్న ఇంటిపైకి ఒరగడంతో సంబంధిత అధికారులు వెంటనే విద్యుత్ సరఫరాను నిలివేసి స్తంభాన్ని సరిచేయడానికి ప్రయత్నాలను ముమ్మరం చేశారు.

10 నుంచి తరగతులు ప్రారంభం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో 2024–25 విద్యాసంవత్సరానికి గాను బీఏ, బీకాం, బీఎస్సీ విద్యార్థులకు ఈనెల 10 నుంచి మూడో సెమిస్టర్, ఐదో సెమిస్టర్ తరగతులు ప్రారంభమవుతాయని ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.జ్యోతి తెలిపారు. విద్యార్థులు తరగతులకు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. అటెండెన్స్ లేని విద్యార్థులకు పరీక్షలకు అనుమతివ్వబోమని స్పష్టం చేశారు. ఈనెల 3న కళాశాలలో వివిధ విభాగం అధిపతులతో నిర్వహించిన సమావేశంలో నిర్ణయించినట్లు ప్రిన్సిపల్ పేర్కొన్నారు.

ఎంపీ కావ్యకు మాజీ మేయర్ అభినందనలు



వరంగల్ చౌరస్తా : వరంగల్ లోకసభ కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొందిన కడియం కావ్యకు మంగళవారం మాజీ మేయర్ గుండా ప్రకాశ్‌రావు పుష్పగుచ్ఛం అందచేశారు. భారీ మెజార్టీతో విజయం సాధించడంపై అభినందనలు తెలిపారు.

కావ్య గెలుపుతో సంబురాలు



హన్మకొండ: హనుమకొండ గోకుల్ కూడలిలో సంబురాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ శ్రేణులు



ఖిలావరంగల్ : రంగశాయిపేటలో బాణసంచా కాల్చుతున్న పీఏసీఎస్ సొసైటీ చైర్మన్ జనార్దన్



కాజీపేట : కాజీపేట చౌరస్తాలో సంబురాలు చేసుకుంటున్న కాంగ్రెస్ కార్యకర్తలు

హన్మకొండ : వరంగల్ పార్లమెంట్ స్థానం నుంచి కడియం కావ్య విజయం సాధించడంతో కాంగ్రెస్ శ్రేణులు సంబురాలు జరుపుకున్నారు. మంగళవారం రాత్రి హనుమకొండలోని గోకుల్ కూడలిలో బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బంక సంపత్ యాదవ్, నాయకులు నాయిని లక్ష్మారెడ్డి, బంక చందు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాజీపేట రూరల్ : నగరంలోని 47వ డివిజన్‌లో బోడగుట్ట అంబేడ్కర్ విగ్రహం సెంటర్ వద్ద, కాజీపేట మెయిన్‌రోడ్ డీజిల్‌కాలనీ సెంటర్ వద్ద కాంగ్రెస్ నాయకులు మంగళవారం బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మానస మధు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మనోహర్, వీరేష్‌కుమార్, వీరవెంకట రాజులు, యాదగిరి, సాయినాథ్ పటేల్, దేవయ్య, భానుప్రసాద్, దుర్గప్రసాద్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

కాజీపేట అర్బన్ : కాజీపేట మండలం న్యూశాయంపేటలో మంగళవారం కార్పొరేటర్ మామిండ్ల రాజు ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు సంబురాలు జరుపుకున్నారు. స్వీట్లు పంపిణీ చేసి, బాణసంచా పేల్చి సంబురాలు జరుపుకున్నారు.

కాజీపేట: కడియం కావ్య గెలుపొందడంతో కార్యకర్తలు కాజీపేట చౌరస్తాలో మంగళవారం సంబురాలు జరుపుకున్నారు. కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలీ, మాజీ కార్పొరేటర్ అశోక్, సాంబయ్య, రాజయ్య, భరత్ పాల్గొన్నారు.

మడికొండ: వరంగల్ ఎంపీగా డాక్టర్ కడియం కావ్య భారీ మెజార్టీతో గెలుపొందడంతో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మడికొండ చౌరస్తాలో బాణ సంచాపేల్చి, స్వీట్లను పంపిణీ చేసుకొని సంబురాలు జరుపుకున్నారు. 46, 64వ డివిజన్ అధ్యక్షులు నాగరాజు, కుర్ల మోహన్, కృష్ణమూర్తి, కొంరయ్య, లింగమూర్తి, వెంకటయ్య,లింగయ్య, మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, శంకర్, రవీందర్, జ్యోతి అమర్‌నాథ్, నవీన్‌యాదవ్ పాల్గొన్నారు.

హసన్‌పర్తి: మండల కేంద్రంలో సంబురాలు కాంగ్రెస్ శ్రేణులు జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్వీట్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు కనపర్తి కిరణ్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు వెంకటేశ్వర్లు, డివిజన్ మాజీ అధ్యక్షుడు ఆరెల్లి వెంకటస్వామి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వీసం సురేందర్‌రెడ్డి,



హసన్‌పర్తిలో..

మాజీ ఉపసర్పంచ్‌లు రామరావు, శ్రీనివాస్, దేవస్థాన మాజీ చైర్మన్ జె.రవి, సంపత్ పాల్గొన్నారు.

ఖిలా వరంగల్ : వరంగల్ పార్లమెంట్ సభ్యురాలిగా కడియం కావ్య భారీ మెజార్టీతో గెలిచిన సందర్భంగా మంగళవారం ఖిలావరంగల్ త్రికోటతో పాటు రంగశాయిపేట, శంభునిపేట, కరీమాబాద్, శివనగర్,మామునూరు, తిమ్మాపురం, అల్లీపురం, బొల్లికుంట ప్రాంతాల్లోని ముఖ్యకూడళ్లలో కాంగ్రెస్ శ్రేణులు సంబురాలు జరుపుకున్నారు. బాణసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్పొరేటర్ ఉమ, దామోదర్‌యాదవ్, సొసైటీ చైర్మన్ కేడల జనార్దన్, మాజీ కార్పొరేటర్ కేడల పద్మ, కార్పొరేటర్లు గుండు చందన, పోశాల పద్మ, శ్రీరాం రాజేష్, చందర్, గజ్జెల శ్యామ్, సాగర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కాజీపేట రూరల్: బాణాసంచా కాల్చుతూ..



కాజీపేట అర్బన్ : స్వీట్లు పంచుతున్న నాయకులు



మడికొండ : మడికొండ చౌరస్తాలో..

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- సైబర్ క్రైం ఏసీపీ విజయ్ కుమార్



ఎన్‌సీసీ కేడెట్లకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఏసీపీ విజయ్‌కుమార్

మామునూరు: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వరంగల్ సైబర్ క్రైం ఏసీపీ విజయ్ కుమార్, సీఐ రవికుమార్ సూచించారు. ఖిలావరంగల్ మండలం మామునూరు జవహర్ నవోదయ విద్యాలయం ప్రాంగణంలో ఎన్‌సీసీ 8వ బాలికల బెటాలియన్ వరంగల్ ఆధ్వర్యంలో ఈనెల 1 ప్రారంభమైన ఎన్‌సీసీ శిక్షణ శిబిరం మంగళవారం నాలుగో రోజుకు చేరుకుంది. ముఖ్యఅతిథులుగా వారు హాజరై సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సైబర్ మాఫియా ద్వారా సమాజంలో ఎన్నో అవకతవకలు పాల్పడి ప్రజలను ఎన్నో ఇబ్బందులకు గురిచేస్తున్న విధానం, సాంకేతికతను తప్పుగా వాడి సమాజాన్ని భయభ్రాంతులను గురిచేస్తున్నాయని వివరించారు. సైబర్ నేరాలపై ఏమైనా అనుకోని ఘటనలు ఎదురైతే సైబర్ పోలీసులను వెంటనే సంప్రదించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కమాండెంట్ రవికుమార్, డిప్యూటీ కమాండెంట్ రేవతి ప్రభాకర్, లెఫ్టినెంట్ స్వప్న, రమణా, శ్రీనివాస్, ఎం.శ్రీనివాస్, సిబ్బంది, కేడెట్లు పాల్గొన్నారు.

తూర్పులో బీజేపీకే ఓటర్లు మొగ్గు

- 10 రౌండ్లలో మెజారిటీ
- కాంగ్రెస్‌కు 7 రౌండ్లలో ఆధిక్యం
- ఏ రౌండ్‌లోనూ 2వేలు దాటని బీఆర్‌ఎస్ పార్టీ

వరంగల్ : వరంగల్ పార్లమెంట్ స్థానానికి జరిగిన ఎన్నికల్లో మంగళవారం జరిగిన ఎన్నికల కౌంటింగ్ వరంగల్ తూర్పు నియోజకవర్గంలో ఓట్ల లెక్కింపు 17 రౌండ్లలో జరిగింది. ఈ లెక్కింపులో భారతీయ జనతా పార్టీ అభ్యర్థి అరూరి రమేష్ 10 రౌండ్లలో ఆధిక్యం కనబర్చగా కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యకు 7 రౌండ్లలో ఆధిక్యం వచ్చింది. భారతీయ జనతా పార్టీకి 7,954 ఓట్ల మెజార్టీ రావడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఒక్కసారిగా ఖంగుతిన్నారు. ఏ రౌండ్‌లో కూడా బీఆర్‌ఎస్‌కు 2వేల ఓట్లు కూడా లభించకపోవడంతో పార్టీ శ్రేణులు నిరాశనిస్పృహల్లో మునిగిపోయారు.

రౌండ్	బీజేపీ	కాంగ్రెస్	బీఆర్‌ఎస్
1	5282	3302	994
2	4534	5024	1570
3	2866	5896	624
4	4913	5080	1919
5	4150	3192	512
6	4999	4641	1292
7	3819	4269	908
8	5568	2822	1176
9	5510	3379	1584
10	4228	3821	1446
11	3665	5895	1497
12	3790	3995	1882
13	6008	3566	1372
14	5620	3403	1773
15	4481	4343	1250
16	3926	4918	1459
17	1952	1674	1005

అంతరాయాలు ఏర్పడితే ఫోన్‌లో సంప్రదించాలి

హన్మకొండ : ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్, వరంగల్ టౌన్ డివిజన్ పరిధిలో విద్యుత్ అంతరాయాలు జరిగితే సంబంధిత సెక్షన్ కార్యాలయాలకు చెందిన ఫోన్ నంబర్లలో సంప్రదించాలని ఎన్పీడీసీఎల్ హనుమకొండ, వరంగల్ ఎస్ఈలు వెంకటరమణ, మధుసూదన్ సూచించారు. సెక్షన్‌ల వారీగా ఫ్యూజ్ ఆఫ్ కాల్, సంబంధిత సెక్షన్ ఏఈల ఫోన్ నంబర్లను ప్రజల ముందుకు తీసుకొస్తున్నట్లు వారు వేర్వేరు ప్రకటనలో వివరించారు. వరంగల్ మహానగరంలోని విద్యుత్ వినియోగదారులు ఫోన్‌నంబర్లు అందుబాటులో ఉంచుకోవాలని, విద్యుత్ అంతరాయాలు కలిగినా, సమస్యలున్నా దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్ చేయాలని వారు సూచించారు.

సెక్షన్	ఏఈ ఫోన్ నెంబర్	ఫ్యూజ్ ఆఫ్ కాల్
గోపాల్‌పూర్	94910 58646	94910 74615
నయీంనగర్	94408 11344	94910 75001
యాదవనగర్	83338 23913	94924 61893
నక్కలగుట్ట	94408 11346	94910 74613
సుబేదారి	94408 11347	83310 11383
హన్మకొండ చౌరస్తా	94408 11343	94910 75002
మచిలీబజార్	94906 14531	87024 61605
ఎన్ఐటీ	94408 11345	94910 75003
కాజీపేట	83339 23912	94910 75005
వడ్డేపల్లి	83339 23916	94924 61801
మడికొండ	94408 11354	94910 75044
కడిపికొండ	79016 24851	---------
మట్వాడ	94408 11349	94910 75009
పోచమ్మమైదాన్	94408 11348	94910 75013
దేశాయిపేట	94910 58647	83329 89176
ఆరెపల్లి	79016 28356	94910 75045
ఆజాంజాహిమిల్స్	94408 11352	94910 75008
ఖిలావరంగల్ రోడ్	79016 28356	94948 59795
స్టేషన్ రోడ్	94408 11350	94935 45861
గొర్రెకుంట	94408 11353	94910 75007
శంభునిపేట	83339 23910	94413 84231
కరీమబాద్	94408 11351	94935 45868
మామునూర్	94408 11355	94910 75047

రోడ్ల పక్కనే పడేస్తున్న వ్యర్థ పదార్థాలు

- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు



కడిపికొండ బ్రిడ్జి కింద గుర్తుతెలియని వ్యక్తులు వేసిన చెత్త

కాజీపేట: పట్టణంలోని అనేక ప్రాంతాల్లో అంతర్గత రహదారుల పక్కన కొందరు బహిరంగంగా చెత్త, ఇతర వ్యర్థాలు పారబోస్తున్నారు. ఉదయం, రాత్రి తేడా లేకుండా పారబోస్తుండటంపై స్థానిక కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొందరు ద్విచక్రవాహనాలపై కవర్లలో చెత్త తీసుకొచ్చి వేస్తూ అనాగరికంగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటి వద్దకు నిత్యం చెత్త తరలింపు వాహనాలు వస్తున్నా కొందరు కాసులకు కక్కుర్తిపడి పరిసర ప్రాంతాలను అధ్వాన్నంగా మారుస్తున్నారని వాపోతున్నారు. పరిశుభ్రంగా ఉంచేందుకు కార్పొరేటర్లు, స్థానిక అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నా కొందరు చెత్తవేస్తుండటం దారుణమని అంటున్నారు. అధికారులు రహదారుల చెంత నిఘా పెట్టి ఇటువంటి వారిపై భారీగా జరిమానాలు విధిస్తే మిగతావారు భయపడతారని కాలనీవాసులు చెబుతున్నారు. పట్టణంలోని చైతన్యపురి కాలనీ, ప్యారడైజ్ ఫంక్షన్, కడిపికొండ బ్రిడ్జి కింద, డీజిల్‌కాలనీ శివారు, సోమిడి, ప్రశాంత్‌నగర్ కాలనీల్లో రోడ్ల పక్కన చెత్త వేస్తుండటంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు చెత్త వేస్తున్న వ్యక్తులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయా కాలనీల అభివృద్ధి కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని సానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్ దృష్టికి తీసుకెళ్లగా తప్పకుండా చెత్తవేసే వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు.

చౌర్‌బౌళిలో యువకుల హల్‌చల్



వరంగల్ చౌరస్తా : వరంగల్ చౌర్‌బౌళి లర్నర్స్ ల్యాండ్ స్కూల్ లైన్‌లో యువకులు హల్‌చల్ చేస్తున్నారు. నిత్యం రాత్రి వేళల్లో మద్యం తాగుతూ, గొడవలకు దిగుతున్నారు. పోలీసుల పర్యవేక్షణ లేకపోవడంతో యువకుల ఘర్షణలు, మద్యం బాటిళ్లను పగులకొడుతూ చేస్తూ నానా హంగామా సృష్టిస్తున్నారు. దీంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో మహిళలు, పిల్లలు ఆ రోడ్డు వెంట వెళ్లేందుకు బెంబేలెత్తిపోతున్నారు. అల్లరిమూకలపై పోలీసులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఈటల గెలుపు ముదిరాజ్‌ల అభివృద్ధికి మలుపు



వరంగల్ చౌరస్తా : వరంగల్ చౌరస్తాలో స్వీట్లు తినిపించుకుంటున్న బీజేపీ శ్రేణులు

హన్మకొండ: మల్కాజిగిరి నుంచి పోటీ చేసిన బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ గెలుపు ముదిరాజ్‌ల అభివృద్ధికి మలుపు అని ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని మల్కాజిగిరి స్థానంలో 3,50,000 పై చిలుకు మెజార్టీతో గెలిచిన ఈటలకు మెపా శుభాకాంక్షలు తెలిపింది. కేంద్రంలో మంత్రి పదవి ఇచ్చి ముదిరాజ్‌లకు తగిన న్యాయం చేయాలని కోరారు. మెపా రాష్ట్ర కార్యదర్శులు నీరటి రాజు, కూతురు రాజు, చిరంజీవి, సింగారపు రామకృష్ణ, పెండ్యాల కృష్ణ, రవీందర్ ముదిరాజ్‌లు ఎంపీగా విజయం సాధించిన ఈటలకు శుభాకాంక్షలు తెలిపారు.

బీజేపీ శ్రేణుల విజయోత్సవం

వరంగల్ చౌరస్తా : బీజేపీ మూడోసారి ప్రజలు పట్టంకట్టడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం సాయంత్రం వరంగల్ చౌరస్తాలో బీజేపీ శ్రేణులు సంబురాలు జరుపుకున్నారు. బాణా సంచాలు పేల్చి, స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ మాట్లాడుతూ 10 ఏళ్ల ప్రభుత్వం నడుపుతూ మన దేశాన్ని ప్రపంచ పటంలో ప్రత్యేక స్థానంలో ఉంచిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కుసుమ సతీష్, రత్నం సతీష్ షా, బాకం హరిశంకర్, సముద్రల పరమేశ్వర్, కనుకుంట్ల రంజిత్ కుమార్, ఎరుకుల రఘునరెడ్డి, కాసు శిల్ప, పొట్టి శ్రీనివాస్ గుప్తా, కుమార్, సుమన్ కత్రి, మురళీకృష్ణ, వెంకటేష్, శ్యామ్, రాజు, దీందయాల్, రతన్, తదితరులు పాల్గొన్నారు.

ఘటనా స్థలానికి ఎమర్జెన్సీ బ్రేక్‌డౌన్ బృందం

కాజీపేట రూరల్ : కాజీపేట సబ్‌డివిజన్ పరిధిలోని బెల్లంపల్లి రూట్‌లో రాఘవపురం రైల్వేస్టేషన్ యార్డు సైడింగ్‌లో మంగళవారం పట్టాలు తప్పిన గూడ్స్ రైలు వ్యాగన్ ఘటనా స్థలానికి కాజీపేట ఎమర్జెన్సీ బ్రేక్‌డౌన్ బృందం రైలులో తరలివెళ్లారు. పట్టాలు తప్పిన గూడ్స్ వ్యాగన్ సమాచారాన్ని రైల్వే అధికారులు ప్రమాద ఘంటికలతో ఎమర్జెన్సీ స్టాఫ్‌కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఎమర్జెన్సీ బృందం హుటాహుటిన రైల్వే స్టేషన్‌కు చేరుకొని యాక్సిడెంట్ రిలీఫ్ ట్రైన్ (ఏఆర్‌టీ) రైలులో తరలివెళ్లినట్లు రైల్వే అధికారులు తెలిపారు. పట్టాలు తప్పిన వ్యాగన్‌ను యథావిధిగా పట్టాలపైకి తీసుకరావడానికి తరలినట్లు వారు పేర్కొన్నారు.

గుడిసెవాసులకు పట్టాలివ్వాలి



మాట్లాడుతున్న సాంబయ్య

నర్సంపేట : పట్టణ పరిధిలోని ఎన్టీఆర్ నగర్‌లోని సర్వే నంబర్ 111లోని ప్రభుత్వ భూమిని సర్వే చేసి గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాంబయ్య, రాష్ట్ర సెక్రటరీ ఎలిగేటి భాస్కర్ డిమాండ్ చేశారు. డీబీఆర్‌పీ ఆధ్వర్యంలో గుడిసెలు వేసుకున్న పేదలకు మంగళవారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సాంబయ్య, భాస్కర్ మాట్లాడారు. ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని ఆందోళన వెలిబుచ్చారు. పేదలకు ప్రభుత్వ భూములను పంచే దిశగా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో డీబీఆర్‌పీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇమ్మడి బాబు, జిల్లా నాయకుడు రాపర్తి జగన్నాధం, నియోజకవర్గ ఇన్‌చార్జ్ గణిపాక అశోక్, మండల ఇన్‌చార్జ్ కందగడ్డ సురేశ్, మహిళా సంఘం నాయకులు అల్లం రాజక్క, సమ్మక్క, రజిత పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కారు ఢీకొని మహిళ మృతి



మడికొండ: కారు ఢీ కొనడంతో మహిళ అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మడికొండలో చో టు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మసాగర్ మండలం ఉనికిచర్లకు చెందిన కోట శశిరేఖ(58) ఆదివారం మడికొండలోని వారి పెద్ద కూతురు దాసరి రాధిక వ ద్దకు వచ్చి సోమవారం ఉదయం 4.40 గంటలకు జనగామలోని పెద్ద కుమారుడు కోట రాజ్‌కుమార్ దగ్గరకు వెళ్లేందుకు శశిరేఖ, భర్త భిక్షపతి, కుమార్తె దాసరి రాధికతో కలిసి నడుచుకుంటూ వెళ్తున్నా రు. ఈ క్రమంలో మడికొండ శివారులోని బాలాజీ కన్వెన్షన్ హాల్ ఎదురుగా రోడ్డు దాటుతుండగా కాజీపేట నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి శశిరేఖను ఢీ కొట్టింది. తలకు బలమైన గాయాలు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు చేరుకుని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. శశిరేఖ భర్త భిక్షపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రతాప్ తెలిపారు.

అల్లుడిపై మామ ఫిర్యాదు

మడికొండ: అల్లుడిపై మామ ఫిర్యాదు చేసిన సంఘటన మడికొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం..హనుమకొండ పెద్దమ్మగడ్డకు చెందిన కొంగర రజితను కాజీపేట మండలం తరాలపల్లికి చెందిన ఇల్లందుల రమేశ్‌కు ఇచ్చి 2016 సంవత్సరంలో వివాహం జరిపించారు. వీరికి 6 ఆరేళ్ల కూతురు ఉంది. గతకొద్ది రోజుల నుంచి భార్యపై అనుమానపడుతూ కొడుతుండేవాడు. పెద్దల సమక్షంలోనే పంచాయతీ చేసిన అతను మారలేదు. ఇప్పుడు రజిత 8 నెలల గర్భవతి కాగా మే నెల రెండో వారంలో తన భర్త తిట్టడంతో బిడ్డను తీసుకొని తల్లిగారింటికి వెళ్లింది. మే 14న రమేశ్ అత్తగారింటికి వెళ్లి గొడవ పెట్టుకొని భార్య, బిడ్డను తీసుకొని తన ఇంటికి వెళ్లాడు. మే 28న మధ్యాహ్నం తన మామకు ఫోన్ చేసి మీ బిడ్డ రజితకు అరోగ్యం బాగా లేదని చెప్పాడు. రమేశ్ మిషన్ ఆస్పత్రికి తీసుకెళ్తే ఆపరేషన్ చేయాలని డాక్టర్లు చెప్పినట్లు తెలుపడంతో వెంటనే అత్తమామలు ఇద్దరు ఆస్పత్రికి వెళ్లగా కడుపులో బిడ్డ చనిపోయింది. ఆపరేషన్ చేసి తీయాలని లేకుంటే తల్లికి ప్రమాదమని చెప్పడంతో ఆపరేషన్ చేసి బిడ్డను బయటకు తీసి చూపించారు. అనంతరం రజితకు బీపీ ఎక్కువై కంట్రోల్ కాకపోవడంతో మెరుగైన వైద్యంకోసం ఎంజీఎం ఆస్పత్రికి పంపించి వైద్యం పొందుతోంది. భర్త కొట్టడంతోనే కడుపులో బిడ్డ మృతి చెందిందని, ఇప్పుడు తన కూతురు కూడా ఆరోగ్యం నిలకడ లేకుండా చేసిన రమేశ్‌పై చర్యలు తీసుకోవాలని మామ కొంగర ప్రసాద్ ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ డి.ప్రతాప్ తెలిపారు.

దాడి చేసిన వ్యక్తి పై కేసు

ఖిలా వరంగల్: ఒకరిపై దాడి చేసిన నేపథ్యంలో హరీశ్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు మిల్స్ కాలనీ ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఖిలా వరంగల్ తూర్పుకోటకు చెందిన జి.వెంకన్న మంగళవారం ఉదయం దూపకుంట రోడ్డు మైమాస్టర్ హైస్కూల్ సమీపంలోని వ్యవసాయ భూమిలో దుక్కి దున్నుతుండగా అక్కడికి కె. హరీష్ చేరుకున్నాడు. ఏరా వెంకన్న నాంద్రె రాజు కుమార్తె శారీ ఫంక్షన్‌కు నాకు చెప్పమని నీతో చెప్పాడంటా నాకు ఎందుకు చెప్పలేదంటూ ఆవేశంతో వెంకన్నపై హరీష్ కర్రతో తలపై కొట్టగా తీవ్ర రక్తస్రావం జరిగింది. క్షతగాత్రున్ని వెంటనే స్థానిక రైతులు ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. వెంకన్న కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మల్లయ్య తెలిపారు.

తాగునీటికి తండ్లాట

- రూ.20ల ఖర్చు చేసి ప్రైవేట్‌గా కొనాల్సిందే !
- ముక్కుపిండి వాటర్ బిల్లు వసూలు

ఖిలా వరంగల్ : వేసవి ఎండ, ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. తాగుదామంటే నీటిచుక్క దొరకని పరిస్థితి. ప్రధానంగా వరంగల్ 43వ డివిజన్ గణేష్‌నగర్ కాలనీలో ప్రజలు తాగునీటి కోసం తల్లడిల్లుతున్నారు. పైపులైన్లు ఉన్నా తాగునీరు సరఫరా లేక నానా ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వెలిబుచ్చారు. దీనిపై ఏఈ, డీఈ స్థాయి అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టింపు లేదని స్థానికులు చెబుతున్నారు. పరిష్కారం కోసం మొదటిసారి ఫోన్ చేస్తే స్పందన కరువు. రెండో సారి కాల్ చేస్తే స్విచ్ఛాఫ్ చేస్తున్నారన్నారు. కాలనీలో బోర్లు, బావులు అడుగంటి పోయాయని, తాగునీరు సరఫరా చేయాలని 43వ డివిజన్ కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేసినా సమాధానం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో పైపులైన్ ద్వారా సరఫరా లేక గుక్కెడు నీటి కోసం ఇక్కట్లు పడుతున్నామని వాపోయారు. దూరప్రాంతం నుంచి రూ.20లు పెట్టి ప్రైవేట్‌గా మినరల్ వాటర్ తెచ్చుకుని గొంత తడుపుకుంటున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా బల్దియా అధికారులు స్పందించి గణేష్‌నగర్ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

మల్లన్న ఆలయంలో మాసశివరాత్రి వేడుకలు

ఐనవోలు : ప్రఖ్యాత ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయంలో మాసశివరాత్రిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ మేరకు మంగళవారం ఉదయం నిత్యపూజల అనంతరం అర్చకులు స్వామివారికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, రుద్రహోమం, స్వామి, అమ్మవార్లకు కల్యాణం జరిపించారు. ఒగ్గు పూజారులు స్వామివారికి ఎదురుగా నజరు పట్నం వేసి పూజలు చేశారు.